కర్ణాటక సంగీత కచేరీ



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలలో కళాకారులు శివానీ సరస్వతుల గాత్ర కచేరీ వీనులవిందుగా సాగింది. అలాగే కర్ణాటక సంగీత కచేరీతో సందర్శకులను అలరించారు. హోప్ అడ్వర్టైజింగ్ ప్రై.లి.డైరెక్టర్ సునీత శివానీని సన్మానించారు.కాగా నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గాంధీ బుణకర్ మేళాకు సందర్శకుల తాకిడి పెరిగింది.

పాఠశాల వార్షికోత్సవం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో సాధన ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ ఆరవ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.'పనాష్ రిథమ్ ఆఫ్ సెన్సెస్' పేరిట నిర్వహించిన కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ సునంద్ సూరపనేని, చైర్‌పర్సన్ పద్మప్రియ, మేనేజింగ్ డైరెక్టర్ సాధన సూరపనేని ప్రారంభించారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్రీడా విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. పాఠశాల డైరెక్టర్ మురళీమోహన్, ప్రిన్సిపల్ ప్రమీల దుగ్గినేని, వైస్ ప్రిన్సిపల్ మాధవిలత, అకడమిక్ హెడ్ శిరీష, సీనియర్ హెచ్‌ఎం వందన, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మురుగుతో సతమతం

- సంవత్సరాలు గడుస్తున్నా పరిష్కారంకాని సమస్య
- మియాపూర్–నిజాంపేట హైటెన్షన్ లైన్ రోడ్డు పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు



మియాపూర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు హైటెన్షన్ లైన్ రోడ్డు పక్కన మురుగు

మియాపూర్: ప్రధానరోడ్లపై, రోడ్ల పక్కన మురుగునీరు పారుతున్నా ప్రజాప్రతిధులు, అధికారులు పరిశీలనలతోనే సరిపెడుతున్నారని, పరిష్కారం చూపడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు దుర్వాసన భరించలేకపోతున్నామని.. సాయంత్రం అయితే దోమలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రతిసారి వచ్చి సమస్యను పరిశీలించడమే తప్ప చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.

- మియాపూర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డుపై భాగంలో ఉన్న కాలనీల నుండి వచ్చే మురుగు ప్రధాన రహదారిపై పారుతుంది. మియాపూర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ రోడ్డులో కోరుకొండ సైనిక్ స్కూల్, ఓల్డేజ్ హోం వెనుక వైపు నుంచి వచ్చే మురుగునీరు మియాపూర్ నుంచి నిజాంపేట్ హైటెన్షన్ లైన్ ప్రధానరోడ్డుపై ప్రవహిస్తుంది. పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో మురుగునీరు నిలిచిపోయి చెరువును తలపిస్తూ దుర్వాసన వెదజల్లుతుంది.
- సీఆర్‌పీఎఫ్ క్యాంపు పక్కనుండి లక్ష్మీనారాయణ ఎన్‌క్లేవ్, సాయి సిగ్నేచర్, పూజ సఫైర్ అపార్ట్‌మెంట్ ముందు నుండి సోని గార్డెన్ ఫంక్షన్ హాల్, సుభాష్ చంద్రబోస్ బస్తీ వరకు మురుగు ప్రవహిస్తుంది.
- సంవత్సరాల తరబడి ఇదే సమస్య అని ఇబ్బందులుపడుతున్నామని చుట్టుపక్కల కాలనీలు, అపార్ట్‌మెంట్ వాసులు పేర్కొంటున్నారు.
- ఈ రోడ్డు వెంబడి అపార్ట్‌మెంట్‌ల పక్కన ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉండడంతో చుట్టుపక్కల కాలనీల నుండి చెత్తచెదారం, భవన నిర్మాణ వ్యర్థాలు తీసుకువచ్చి ఇక్కడ పారబోస్తున్నారు.
- మియాపూర్ నుంచి నిజాంపేట్‌కు వెళ్లేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డును ఎక్కువగా జనం ఉపయోగిస్తుంటారు. వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్ల పక్కన మురుగునీరు నిల్చి ఉండడంతో దుర్వాసనతో బాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి.

అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించడంతో బాటు ఈ రోడ్డు పక్కన చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.





రోడ్డు పక్కన చెత్త, మురుగు

రైతుల ఆర్థిక అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: రైతుల ఆర్థిక అభ్యున్నతికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు అండగా నిలవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముత్తంగి గ్రామంలో 60 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ,, జెడ్పీటీసీ సుప్రజ, గ్రామ సర్పంచ్ ఉపేందర్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షులు బిక్షపతి, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, దశరథరెడ్డి, వెంకటరెడ్డి, పాలకవర్గం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- సాయిరాం కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు హఫీజ్‌పేట్ ఇండస్ట్రియల్ ఏరియా, భాను టౌన్‌షిప్, ప్రజయ్ సిటి, సాయిరాం కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, అపర్ణ విల్లాస్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు మార్తాండ నగర్, ప్రేమ్‌నగర్ మెయిన్ రోడ్డు, ప్రేమనగర్ బి బ్లాక్, ప్రేమ్‌నగర్ వెనక వైపు, హనీఫ్ కాలనీ ఏరియాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.
- పాపిరెడ్డి కాలనీ సబ్‌స్టేషన్ మార్కెట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రేమ్‌నగర్ వెనుక వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 అడుగుల రోడ్డు ఇరువైపులా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ : వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో.. చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల సందర్భంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, గణపతి టెంపుల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.
- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్, శ్రీదేవి థియేటర్, జవహర్ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్–1, ఫేజ్–2, సెక్రటేరియట్ కాలనీ, ఎన్‌వీడియా, నానక్ రాంగూడ, వేవ్‌రాక్, వజ్ర అపార్ట్‌మెంట్స్, రాజపుష్ప అపార్ట్‌మెంట్స్, ఎక్తా విల్లాస్, అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు టీఎన్‌జీఓస్ ఫేజ్–1, ఫేజ్–2 తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : రాంనరేష్‌నగర్, లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రాంనరేష్‌నగర్, హైదర్ నగర్ విలేజ్, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రాంతం, డోవా కాలనీ, ఎస్‌ఎంఆర్ వినయ్ సిటీ, రత్నదీప్ సూపర్ మార్కెట్, నరేన్ గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ తెలిపారు.

పెండింగ్ పనుల నిధులు మంజూరు చేయండి



మహిళా సమైక్య భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి మంజూరైన పనులకు సంబంధించిన 475 కోట్ల రూపాయలను సత్వరమే మంజూరు చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పటాన్‌చెరు మండలం కర్దనూరు గ్రామంలో శనివారం ఒక కోటి 14 లక్షల 60 వేల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న తరుణంలో పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, అలాగే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ , జెడ్పీటీసీ సుప్రజ, గ్రామ సర్పంచ్ ఎర్ర భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ నాగజ్యోతి, పంచాయతీరాజ్ డీఈ సురేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

రాయదుర్గం: విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.కే.తాజ్‌బాబు బ్యాగుల పంపిణీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవడంతోపాటు అటెండెన్స్ కూడా 100 శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. అత్యధిక అటెండెన్స్ సాధించిన వారికి ప్రోత్సాహకంగా బ్యాగులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజసేవలో..మేము సైతం..

సాక్షి, సిటీ బ్యూరో: ఆపన్నుల సేవలో తాము సైతం పునరంకితమవుతామని కార్పొరేట్ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. నగరంలోని మాదాపూర్‌లో ఉన్న ఫిన్‌కార్ప్ సంస్థ సింక్రనీ ఆధ్వర్యంలో డబుల్ డ్రైవ్ పేరిట సేవా కార్యక్రమాలకు నిధుల సేకరణ చేపట్టారు. వినోదభరితంగా అదే సమయంలో వితరణ మార్గంగా సాగిన ఈ ఈవెంట్ ఆకట్టుకుంది. వందలాదిగా ఉద్యోగులు పాల్గొని పలు వర్చువల్ గేమ్స్ ఆడారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన నిధుల్ని సమాజ సేవకు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

యువతి అదృశ్యం



ప్రవళ్లిక

గచ్చిబౌలి: సూపర్ మార్కెట్‌లో డ్యూటీకంటూ వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సాయులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సుదర్శన్‌నగర్‌లో నివాసం ఉండే ఎం.ప్రవళిక(19) స్థానికంగా ఓ సూపర్‌మార్కెట్‌లో పని చేస్తోంది. ఈ నెల 25న మధ్యాహ్నం 12.30 గంటలకు డ్యూటీకి వెళుతున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో సమీప ప్రాంతాలలో వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి నాగమణి గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే



మారుతీనగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని మసీదుబండ మారుతీనగర్‌లో ఎస్‌ఎంఆర్ అపార్ట్‌మెంట్స్ పక్కన తలెత్తిన రోడ్డు సమస్యపై కాలనీవాసుల ఫిర్యాదు మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలుగురు బిల్డర్లు ఉండటం వలన సమన్వయ లోపంతో సమస్య తలెత్తిందని ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నిర్ణీత రోడ్డును వదిలి ప్రహరీ నిర్మించుకోవాలని, ప్రజావసరాల దృష్ట్యా కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఏసీపీ మెహ్రా, టీపీఎస్ రవీందర్, టీపీఎస్ రమేష్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రవీందర్‌యాదవ్, ప్రసాద్, శ్రీకాంత్, ప్రసాద్, కాలనీవాసులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కిరణ్‌కుమార్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మియాపూర్ : ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మియాపూర్ ట్రాఫిక్ సీఐ కిరణ్‌కుమార్ అన్నారు.మియాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలలోపు పిల్లలు వాహనాలను నడపరాదన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు సురేష్, అనిల్, సుభాష్, నవీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుడా ట్రేడ్ సెంటర్‌లో ఆయుర్వేద వైద్యశిబిరం

శేరిలింగంపల్లి: హుడాట్రేడ్ సెంటర్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానికులు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో బనారస్ హిందూ విశ్వవిద్యాలయం పూర్వ తెలుగు ఆయుర్వేద వైద్యుల అసోసియేషన్, గవర్నమెంట్ అయుర్వేద ఆస్పత్రి ఎర్రగడ్డ సహకారంతో శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా 150 మంది స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో బీహెచ్‌యూ తెలుగు ఆయుర్వేద వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పివివి ప్రసాద్, ఉపాధ్యక్షులు డా.సుజాత, కార్యదర్శి డాక్టర్ వి నర్సింహ, సభ్యులు డాక్టర్ శైలజావాణి, ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్ రామచంద్రారెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్లు శోభారాణి, విజయలక్ష్మి, భవాని పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్, అమ్మయ్య చౌదరి, హుడాట్రేడ్ సెంటర్ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రాము, ఆంజనేయులు, శ్రీనివాసచారి, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న కిమ్స్ వైద్యులు

గచ్చిబౌలి: గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చని రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఎం.ప్రవీణ్‌రావు తెలిపారు. శనివారం కొండాపూర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా సీపీఆర్‌పై అక్కడి సిబ్బంది, డ్రైవర్లకు కిమ్స్ వైద్య బృందం అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు సీపీఆర్ ఎలా చేయాలో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కిమ్స్ డాక్టర్ ప్రతాప్, ఎంవీఐలు విజయరావు, వాసు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం మయూరి నృత్యాలయ శిష్యబృందం నృత్యార్చన చేశారు. గురువు రాజనాల దేవి రామ్‌కుమార్ శిష్యబృందం గణేశ పంచరత్న, కీర్తన, శరణు శరణు, దశావతారశబ్దం తదితర అంశాలను ప్రదర్శించారు. అనంతరం కళాకారులను డాక్టర్ శోభారాజు జ్ఞాపికలతో సత్కరించారు.

మ్యాట్రిమోని మోసం కేసులో ఇద్దరి అరెస్ట్



మద్దుగారి చంద్రకాంత్



మద్దుగారి భవాని

రాయదుర్గం: మ్యాట్రిమోని మోసం కేసులో సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ1గా విజయవాడలోని తాడేపల్లి అపర్ణా టవర్స్‌లో నివాసముంటున్న వ్యక్తి మద్దుగారి చంద్రకాంత్, ఏ2గా నట్టాభవాని అలియాస్ మద్దుగారి భవానీగా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తూ పలు అంశాలు, వారు చేసిన మోసాలను గుర్తించారు. ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సదరు మహిళ తెలుగు షాదీ డాట్‌కామ్ యాప్‌లో చంద్రకాంత్‌ను కలిశారు. డిసెంబర్ 2023 తర్వాత వాట్సాప్‌లో కమ్యూనికేషన్ కొనసాగించారు. చంద్రకాంత్ డాక్టర్‌గా ఏపీ, తెలంగాణ, కర్నాటకలో ఆస్పత్రుల చైన్ వ్యాపారానికి ప్రణాళిక చేస్తున్నానని, బ్యాంకు ఖాతాతో ఆదాయపు పన్ను సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఆమెకు వివరించారు. నకిలీ ఎస్‌బీఐ ఏటీఎం స్లిప్పులను చూపిస్తూ చంద్రకాంత్ మాయమాటలు చెప్పడమే కాకుండా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి చిత్రాలు చూపించి ఆమెను ఒప్పించాడు. ముఖ్యంగా ఆదాయపన్ను సమస్యల పరిష్కరించడానికి అప్పుగా రూ.6 లక్షలు కావాలని కోరగా, స్నేహితుల వద్ద అప్పు చేసి చంద్రకాంత్‌కు అందించారు. కొద్ది రోజుల్లోనే ఈ మొత్తాన్ని వాపస్ చేస్తానని నమ్మబలికాడు. అనంతరం సాకులు చెబుతూ కమ్యూనికేషన్ పూర్తి కట్ చేశారు. దీంతో ఆమె అనేక అంశాలు వివరిస్తూ అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. తనను తానుగా చంద్రకాంత్ ఉన్నతమైన వ్యక్తిగా చిత్రీకరిస్తూ మోసం చేయడానికి వైద్యుడిలా కూడా నటించాడు. అనంతరం 2021లో మహిళతో పరిచయం ఏర్పడి ఆమెకు ఆన్‌లైన్‌లో నట్టాభవాని అని పేరుపెట్టారు. ఆ తర్వాత ఇద్దరు కలిసి నేరాలకు పాల్పడడం ప్రారంభించారు. భవాని పేరిట అనేక ఖాతాలు కూడా తెరిచాడు. 2023 నవంబర్‌లో చంద్రకాంత్ షాదీడాట్‌కామ్‌లో నకిలీ ప్రొఫైల్ నమోదు చేసుకున్నాడు. డాక్టర్ వృత్తిలో ఉంటూ ఉన్నతస్థాయిలో ఆర్థికంగా ఎంతో ఎదిగానని, వ్యాపారవేత్తగా కూడా చెప్పుకున్నాడు, అనేక మంది మహిళలను కూడా సంప్రదించాడు. ఇందు, దివ్య, మౌనిక వంటి వారిని కూడా ఆదాయపు పన్ను సమస్యలు వివరించాడు, వారిని కూడా మోసం చేసి భవాని బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ చేయడానికి చంద్రకాంత్, భవానీ వివిధ సిమ్‌కార్డులను వినియోగించారు. అనేక బ్యాంకు ఖాతాలు తెరిచారు. వారి ద్దరూ మోసపూరిత పథకాలు అమలు చేయడం, నకిలీ పత్రాలు సృష్టించడం, నకిలీ ఏటీఎం స్లిప్‌లు సృష్టించి బాధితులను మోసం చేస్తూ వచ్చారు. అదే క్రమంలో గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఓ మొబైల్ షాపు యజమానిని మోసం చేశాడు. ఈ క్రమంలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో అనేక కేసులు నమోదయ్యాయి. పోలీసులు ఎట్టకేలకు ఆట కట్టించారు. గతంలోనూ మద్దుగారి చంద్రకాంత్, కట్టాభవాని అలియాస్ మద్దుగారి భవానిపై నాలుగు కేసులు నమోదయ్యాయి.

వైభవంగా శ్రీరామ్ శోభాయాత్ర



శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సైబర్‌జోన్ నుంచి శ్రీరామ్ శోభాయాత్రను కనులపండువగా నిర్వహించారు. శనివారం ఈ యాత్రను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రారంభించారు. అయోధ్య సంబరాలను పురస్కరించుకొని నల్లగండ్ల నుంచి గోపన్‌పల్లి రంగనాథ స్వామి ఆలయం వరకు చేపట్టిన ఈ యాత్రలో భక్తులు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అపర్ణ సైబర్ కమ్యూన్, త్రిశాల, రాఘవేంద్ర, అపర్ణ సైబర్‌లైఫ్, హిమసాయి లేక్ వ్యూ, అపర్ణ గ్రాండే, అపర్ణ సరోవర్, రాంకీ వన్ కాస్మోస్, గెలాక్సీ, మంజీర డైమండ్ టవర్ మీదుగా రంగనాథస్వామి ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో హుడా కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో వేగంగా నిర్మాణాలు



గచ్చిబౌలి: భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ 5 గ్రేడ్ సిమెంట్‌తో వేగంగా నిర్మాణాలు చేపట్టవచ్చని భారతి సిమెంట్ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ నితీష్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లోని మాదాపూర్ స్టీల్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారతి సిమెంట్ నాణ్యత గురించి బిల్డర్లకు అవగాహన కల్పించారు. ఈ సిమెంట్ స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపిక అని అన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ చీఫ్ మేనేజర్ సతీష్‌కుమార్, మాదాపూర్ స్టీల్ హౌజ్ ఏజెన్సీస్ యజమాని నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న బీఆర్ఎస్ నాయకులు

హఫీజ్‌పేట్ : ఎమ్మెల్యే గాంధీ మూడవసారి గెలిచినందుకు హఫీజ్‌పేట్ బీఆర్ఎస్ నాయకులు గంగారం హనుమాన్ ఆలయంలో శనివారం మొక్కు తీర్చుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, మధుకుమార్, శ్రవణ్‌కుమార్‌లు 108 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో నాయకులు వాలా హరీష్‌రావు, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.